కథా నిలయం
శ్రీకాకుళం



# ఎట్లాగూబతకనీరు.....

తీవ్రసంఘర్షణలో నలిగిపోతున్నాడు కిట్టయ్య. తిండి సయించట్లేదు. కడుపు కావాలంటోంది. నాల్క తిరగ్గాడ్తోంది. పొయ్యిల మంటెట్టినాది రత్తాలు. ఆ మంటలాగే మనుషుల యవ్వారాలు తలచుకుంటే మండుకొస్తంది గుండె.

ఓ మొక్కెయ్యటానికి ముందుకురాని జనం, అది మానైతే తమ పొయ్యిల పేడ్లకోసం గొడ్డళ్ళేత్తుతారు.

మొన్నటికి మొన్న వారం పద్దిన్నాలు పట్టుకోని దయ్యంలా ఒగ్గింది కాదు తుపాను. ఎదవ్వర్షం.. ఎందరి బతుకుల్నో ముంచిముంచి చంపింది. అట్లాంటి సమయానే... తనెపుడో కట్టుకున్న మట్టిగోడ కరిగి ఒరిగిపోయింది. ఇల్లంతా కూలిపోకముందట్నే. తాటి పట్టెలుంటె పూటు పెట్నాడు.

ఈ సారట్లాగ్గాదు. గోడలు గట్టిగ కట్టాల! మట్టి ముద్దలు ఎంతగట్టిగ పడ్తయొ... అంత జరజర జారుకొస్తయ్!

ఆ వూరికి తన టీ కొట్టే జంక్షన్... ఊర్లో రాజకీయాలు, రంకులు, బొంకులు... తొడచరుపులు... మీసాల మెలికలు... గుడ్లురమటాలు.. కన్నుకొట్టటాలు.. వ్యంగ్యాలు...వెటకారాలు అన్నీ అక్కడ్నే.

అయితే కిట్టయ్య చేతి 'టీ' దేన్ని మరిపిస్తుందో కాని, చివరి బొట్టు కుత్తుకలో

దిగిందాకా బల్లమీదకు గ్లాసు దించరు. అంత పరపతివున్న తనకేం అనుకుని, నిబ్బరానికి దూరం కాకుండా చూసుకున్నాడు గుండెను. ఆ గుండె పెట్టుకున్న తననే కాలం మోసగించింది. తనపై కుట్ర పన్నింది. ఆ ఫలితమే తుపాన్‌కు గోడ కూలిపోవటం! అక్కడికొచ్చి చూసిన ప్రతివాడు వ్యక్తీకరించాడు విచారాన్ని. వారి సానుభూతే తన కొంపను నిలబెడతాయనుకున్నాడు. కాని అవి బోగస్ కబుర్లేనని, ఎప్పస్ మాటలేనని తేలటానికి అట్టే సమయం పట్టలేదు.

టీకొట్టు మదుపులు తప్ప యింత హఠాత్తుగా గోడ కట్టుకోడాన్కి వృత్తిచేతులు వెక్కిరించాయి.

ఇంతకాలం లోపలుండి పనిపాట చేస్కునే రత్తాలు - గోడకూలటం వల్ల అందరి కళ్లకు విందైంది.

తన యింటామె ఆడకూనని చేతిలో పెట్టి తల ప్రక్కకి వాల్చిన క్షణమే ఈ పల్లెకొచ్చి, టీకొట్టు పెట్టినప్పటినుండే రత్తాలు బాగోగులు చూసుకుంటున్నాడు.

పసిదని తనెంత దాచినా ఆగని కాలం దాచలేని పొంగులను రత్తాల్లో పొదిగి ఆడతనమంటే ఏమిటో తెలియచెప్పింది. వెల తక్కువైన దుస్తులు మన్నని కారణాలు రత్తాలు ఒంటిరంగును బంగారు ముద్దలై మెరిపించేవి. అదిచూసి లొట్టలువేసే జనం కళ్ళల్లో కారం కొట్టాలనిపించినా, తన వ్యాపారానికది గొడ్డలి పెట్టవుతుందని నిగ్రహించుకున్నాడు.

అదిగో - అప్పుడే చీకట్లో మెరిసిన దీపంలా గవర్మెంటోళ్ల తరపున సూరిబాబు వచ్చి చెప్పాడు. "మావా! ఇల్లు కూల్నోలకి పైసలిత్తన్నారు. నువ్వు దరకాత్తెట్టు" అని తను స్పష్టంగా మాట్లాడగల్గినా తన కర్థమయ్యే యాసలో చెప్పాడు.

ఎక్కడెక్కడో వేలుముద్రలు పెట్టించుకున్నాడు. రెండ్రోజులు దాట్నేమో లేదో మూడొందలు పట్టుకొచ్చి చేతిల పెట్నాడు. ఆ ఊళ్లో తనంటే కల్మషం లేని అభిమానం వున్నోడు సూరిబాబు ఒక్కడే!

సిమెంట్‌తో కడ్తే సాల్వని గని బుగ్గేసి కట్టేసాడు. బయటకి పలచగా సిమెంట్ రాయిప్పించాడు. వెన్నెల్లాటి వెల్ల కొట్టాడు గోడకి. ఇక పర్లేదు. రత్తాలు ఈడుకి గోడ చాటుంది. కొక్కిరిబిక్కిరి నాయాళ్ళ కళ్ళు పడవింక.

"అయ్యా! టీ తీస్కో." గుంజకి ఆనుకుని అతలాకుతలమైపోతున్న కిట్టయ్యను తట్టి పిలిచింది రత్తాలు. టీ అందుకుని ఆబగా తాగాడు.

"అయ్యా! నీ బాద నా కెరికే! ఎందుకంత కిందమీద పడిపోతున్నావో తెలుసు. ఈ జెనంపచ్చగున్నమంటే పల్కరిస్తరు. లేకుంటే పారిపోతారు... మొన్నటికి మొన్న మన గోడ యవ్వారంలో ఎవ్వరైనా కిసింత సాయం జేసినారా... అందుకె సెబుతున్న... మనగోడ మునపట్నాగపెతీవోడికీ అలుసుకాకూడ్దు.... దాన్ని కరాబుసేత్తే... నువ్వూర్కున్నా నేనూర్కొనేది నేదంతే ఆఁ..." విరిసీవిరియని రత్తాలులో విప్లవం...

అపుడాలోచించాడు బాగా... ఇంతకాలం తన గోడమీదే పెంటచ్చి పిడకలు పెట్టుకునేది.. టూరింగుటాకీసు వాల్‌పోస్టర్స్ అంటించేవోడు శివుడు. ఊర్లో ఎలక్షన్లొస్తే సరేసరి... ఆపార్టీ, ఈ పార్టీ వాళ్ల రాతలన్నీ దానిమీదే... ఆ చిన్న గోడపైనే పెద్దల పెత్తనం.. టీకొస్తున్నారన్న మొహమాటం వల్ల పట్టించుకోలేదు. చివరికి ఇట్టా వచ్చిన తుపాన్ అట్టా పొట్టన పెట్టుకుంది.

అందరికీ ఉపయోగపడే ఆ గోడను ఎవరయినా నిలబెట్రానుకున్నాడు "పిడకలెట్టుకునే దాన్ని నాకాడేటుంటాయి" పద్ద గోడని చూస్తూనే పెదవి విరిచింది పెంటచ్చి.

ఇలాగే మరికొందరు టీకి రావడం మానుకున్నారు.

చాలామంది అట్లనే నోర్లు తెరిచారు తప్ప నోట్ల సాయం చేయలేదు.

ఇపుడు రత్తాలన్నట్లు అంత మొగమాటం లేని మడుసులకి లోకువ కాకూడదు. పసిపిల్లకున్న ధైర్యం తనకు లేకపోతే ఎట్టా... కిట్టయ్య ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

★ ★ ★

ఆరోజు టీ కొట్టు యథాప్రకారం తెరిచినాడు. ఆ ఊరికే కాకుండా చుట్టుప్రక్కల పల్లెలన్నిటికీ కూడలి అది. అక్కడుండేది ఒక్కటే టీ కొట్టు కావడంతో వుదయం పదిదాకా యమరద్దీగా వుంటుంది.

ఆరోజు మాత్రం అందరి దృష్టి క్రొత్తగా లేచిన గోడమీదే వున్నది.

"ఆహా! ఎంత బాగుందిరా ముసలాడా! నీగోడ మీద మా వాల్ పోస్టర్లంటిత్తే గుమ్మయిపోద్ది.. రేపు కొత్తమవోసకి ఎన్టీవోడి బొమ్మ వదుల్తున్నాం. కలెక్సన్లు గలగల్లాడాల..." గోడతనసొత్తేనన్నట్లు మీసం మెలేస్తూ బాబుర్రావు అన్నాడు.

బాబుర్రావుకి ఓ టూరింగు టాకీసుంది. పదిహేను మైళ్లు నడిచి పట్నం పోలేని జనంకి అదే ఎ.సి. థియేటర్... ఏ వూరివాడికయినా కిట్టయ్య టీకొట్టు దగ్గర వాల్‌పోస్టర్ చూస్తే ఏ సినిమావో తెల్సిపోద్ది... ఈ రోజు క్రొత్త గోడమీద దృష్టి సారించిన జనానికి

బోసిగా కనిపించింది.

"బాబూ! తవరి వాల్ పోస్టేటి యింకా అతికించలేదు".

"ఇంకా ఈ దినవే కద్రా... గోడ లెగిసింది... ఇంక మన వాల్పోస్టు తప్పుయింకేంటుంటాయి ఆ గోడమీద..." నవ్విచెప్పాడు బాబుల్రావు.

తొర్లిస్తున్న టీ ఒలికి చురుక్కుమంది కిట్టయ్యకు. బాబుల్రావు మాటలకు మొండి వైఖరి అవలంబించాలనుకున్నాడు.

"శివుడికోటీ సెయ్యి... ఆడువాల్పోస్టు వొట్టుకొస్తున్నాడు". టీ అందిస్తూ అటుచూసాడు కిట్టయ్య. సైకిల్పై శరవేగంతో వస్తున్నాడు వాడు.

సైకిల్ హాండిల్ బార్కి పేట్టు డబ్బా.. వెనకాతల వాల్ పోస్టరు కట్ట...

జనానికి – బాబూల్రావు హాలుకి ఏ బొమ్మ వస్తుందో చూసి తెలుసుకోవాలన్న తహతహ...

కొందరీ లోగానే "శివన్నా ఏట్రా బొమ్మ..." ఒకటే ప్రశ్న – పిల్లకాయలంతా...

"ఎందుకట్టా తొందరెహె"... పిల్లల్ని అదిలించాడు శివుడు.

శివుడి యవ్వారమంతా కనిపెట్టి అక్కడే నిల్చుని చూస్తున్న కిట్టయ్యను బాబుల్రావు– "ఏరా! అట్లా గుడ్లప్పగించి సూత్తావేటి? టీ సెయ్యమని సెప్పాగా..." గుడ్లురిమాడు.

"నేను పెచ్చుతానికే గాదు... అదెప్పటి కాడ్నించో అట్టా సూడబట్టే మా బతుకిలాగయిపోనాది. ఇంతకాలం మీ పేట్టు ముద్దలు అంటించి... అంటించి నా గోడ తవ్వుకుపోనాది... వున్న కాత్త గోడా మొన్న దిక్కుమాలిన వర్సానికి నేలకూల్నాది.. బాబూ నీకు పున్నెం వుంటాది ఎన్నెల్లాటి ఆ గోడని కరాబు సేయమాకండి..."

"ఏట్రా అదేదో యింతగా మాటాడ్తున్నావు...మా టాకీసు కట్నికాడ్నించి ఈ గోడమీదే అతికిస్తుండా... నువ్వీరోజు అడ్డెడితే ఎట్టాగ? ఒరే శివా! అంటించ్రా!!" ఆజ్ఞాపించాడు బాబుల్రావు.

శివుడు కదలటోతే కిట్టయ్య మరొక అడుగు ముందుకేసి అటకాయించాడు.

"ఏట్రోరి.. అదేదో మీబావుగోరు కట్నారా!..."

"ఆఁ బాబూ! ఆఁ మొన్న గాలివోన బూతంలా మీదపడి నేలకరిపించినపుడు మిమ్మల్ని... మిమ్మల్ని అడిగడిగి నా నోరు పుండైంది. ఆ దేవుడ్రచ్చించి గవర్మెంటోల్లు రాబట్టి గోడన్నిలబెట్నారు..." కిట్టయ్య గుండెలో కష్టజీవి ఆర్తనాదం మాటలై నినదించాయి.

ఒక్కసారి ఫక్కున నవ్వాడు బాబుర్రావు.

"ఒరే! ముసిలోడా! నీకింకా లోకగ్గేనం లేద్రా! గవర్మెంటంటే ఎవరనుకున్నావు? మనవే! మనమే పెబుత్వం... మనోల్లే పెజా నాయకులు.. ఆల్లు పెట్టినవే ఈ పదకాలు... పెనాలికలూను... అంటే నీ గోడ మాలాటి నాయకులవల్లే లెగిసిందన్నమాట... అంటే మాకూ హక్కున్నాది. శివా! నువ్వేలా ముసిలోడితోనేటి!!" అని కిట్టయ్యనుండి శివుడ్ని వేరుచేసి ముందుకి తోసాడు.

కిట్టయ్య గుండెల్లో కుతకుత మొదలైంది.

గోడమీద పడబోయే వాల్‌పోస్టర్ పచ్చుటి శరీరం మీద కాలిన మచ్చలా తలుచుకుంటే అసహ్యం వేస్తూంది.

"ఆగు". "ఆక్రోశంతో నిండిన అరుపు విని అటు తిరిగారు.

చంద్రినాయుడు ఊరి మోతుబరి.

"కిట్టయ్యా! ఎవుడ్రా నీ గోడమీద చెయ్యేసేది. వెయ్యమను... పుచ్చెలెగిరిపోతాయి. నీలాటి పేదోడి పైనేన్రా దాస్టీకం... రౌడీతనం వుంటే ఏనుగు లాటి నా మీద చూపమన్రా!" చంద్రినాయుడి మొహంలో ఎర్రతనం బాబుర్రావును జడిపించింది.

బాబుర్రావు లాటివారినీ, వాళ్ళ ఆస్తుల్ని వందల మొత్తం కొనగల స్తోమత వున్న చంద్రినాయుడికీ, బాబుర్రావుకీ మధ్య రాజకీయంగా అనేక స్పర్ధలు విషజ్వాలలై విస్తరించివున్నాయి. అయితే మొన్న కిట్టయ్యపై ధాతృత్వం ప్రదర్శించని మహానుభావుల్లో చంద్రినాయుడూ వున్నాడు. ఎదుటివారిపై విరోధం తప్ప కిట్టయ్యపై ప్రేమతో కాదు అడ్డుకున్నది.

బాబుర్రావు కనుసైగతో ముందుకెళ్ళిన శివుడు చంద్రినాయుడి మంది మార్బలం చూసి వెనక్కి తగ్గాడు.

"ఇక్కడ రగతం పార్టం నాకిట్టంనేదు.. పద్రా శివుడూ... సూద్దాం... యిట్లా ఎంతకాలం జాగిలాలు అడ్డుపడ్తాయో..." బాబుర్రావు చెక్కేసాడు.

తండ్రిని వెనకేసుకువచ్చిన చంద్రినాయుడికి టీ అందించింది రత్తాలు. పమిటవేసే స్థితికి ఎదక్కపోయినా వయసు తెచ్చిన ఎత్తుపల్లాలు-నాయుడిలో స్పర్శకోసం తహతహలాడి - జివ్వుమన్నాయి నరాలు.

"ఏరా! నీ కూతురు రత్తేగదూ! పాపం! తల్లిలేని పిల్లయిపోయిందిరా!!" అనిదాని శిరస్సునుండి వీపుదాకా తడిమినా చంద్రినాయుడి స్పర్శ తేళ్ళు, జెర్రులు పాకినట్టనిపించక

పోవటానికి కారణం అతనిలో మరో అయ్యను చూసుకున్నది.

"బాబూ! తమలాటి పెద్దల అండదండలుంటే దాన్నో యింటిదాన్ని సేత్తా!"

"పసిపిల్ల అపుడే ఎందుకురా దానికి ఆరిందాతనం..."కళ్ళలో కైపులు క్రిందకి దిగలేదు.

టీ త్రాగి వెనుదిరిగాడు నాయుడు.

★ ★ ★

గున్న ఏనుగులాగుండే పెంటచ్చి గబగబ తట్టపట్టుకుని టీకొట్టుకు వచ్చింది. "ఏరా మావా! బాగున్నావా! ఏదీ ఓ టీసెయ్యి... ఈలోపు పేడ కలుపుకుంటా!" తట్టదించి సుమ్మగుడ్డ మొలచుట్టింది.

టీ చెయ్యటం ఆపి కిట్టయ్య క్రిందకి దిగాడు. "ఏటే పెంటచ్చీ! మునపట్నాగ జోరుగావచ్చి... పెడీపెడీమని పిడకలెట్టుకుని పోదామని సూత్తున్నావా ఏటీ!"

"ఏటి మావా! కొత్తగా మాటాడ్తున్నావు! ఈ పిడకల పెంటచ్చి మర్దేనికి వత్తాదని... ఎలాగూ వచ్చాగదాని టీసెప్పా.."

''అదే సెబుతున్నా... యినుకో.. వజ్రంలాటి నా గోడమీద పిడకలెడ్డానికీల్లేదంతే.. ఎల్లెల్లు.." కసిరేసాడు. పిడకలు పెడితేగాని కదలనని భీష్మించుక్కూచుంది పెంటచ్చి.

ఇదంతా చూస్తూ వూర్కోలేని రత్తాలు రంగంలోకి దిగింది.

"ఏటే పికిలిపిట్ట నాగున్నావు... నాతో ఎట్టుకున్నావంటే నీకొట్టు, నువ్వు కూడా కనిపించకుండా పోతారు జాగర్త...' రత్తాలు రాబోతే అడ్డుకున్నది.

ఎవడడ్డు పద్తాడన్నట్లు ప్రవర్తిస్తున్న పెంటచ్చి చెయ్యి పట్టుకుంది రత్తాలు, దురుసుగా విదిలించిందామె... తట్టలో చేయిపెట్టి పేడందుకున్నది. ఆమె విసిరితే సరాసరి గోడకెళ్ళి అతుక్కునేది.... సరిగ్గా అదే సమయంలో సూరిబాబు లూనామీద దిగాడు.

రత్తాలువైపు అభయమిస్తున్నట్లు చూసి ఆ ఆగడాన్ని ఆపాలని అడ్డుగా నిలబడ్డాడు.

"సూర్బాబు! నువ్వడ్డం లెగు సెబుతా... ఈ పెంటచ్చి పేలే టపాసనీల్లకి తెల్డు..." లేవకుంటే అతనిమీదే పిడకలు పెట్టేట్లు వూగిపోసాగింది.

"ఎల్లెల్లే... నీ బాబుగారి సొమ్మటే. అది కట్టుకుందికి ఒక్కరంటే ఒక్కరు సాయపడ్లేదు... ఇపుడేమో కష్టపడి కట్టుకుంటే నీ పెత్తనం చెలాయించాలని చూస్తావా!!"

సూరిబాబు వాగ్ధాటి ప్రభావం పెంటచ్చిని తిరుగుముఖం పట్టేలా చేసింది.

వచ్చినట్లే వచ్చి వెళ్ళిపోతున్న సూరిబాబును టీ త్రాగి వెళ్ళమంది రత్తాలు. టైమ్‌లేదని వెళ్ళిపోయాడు.

★ ★ ★

ఒకరోజు చంద్రినాయుడు బల్లమీద కూర్చుని పేపర్ తిరగేస్తున్నాడు.

పంచాయితీ ఎలక్షన్స్ వస్తున్న వార్తకు ఒక్కసారి స్తంభించిపోయి, తేరుకుని బయటకు చదివాడు. "పదిహేను రోజుల్లో నామినేషన్ ఎయ్యాల్ట..." తనలో తనే అనుకుని పేపర్ మడిచి గబగబ వెళ్ళిపోయాడు నాయుడు.

"నాయుడిగారికే చెల్లింది. ఎలక్షన్లంటే మాటలా... మనుషులుండాలి. అంతకు పదింతల పైసలుండాలి. ఈ సారి బాబుర్రావు ఏంచేస్తాడో... చూడాలి..." ఎవరెవరో మాట్లాడుతున్నారు.

కిట్టయ్యకామాటలు గుండెల్లో బేజారు కల్గించాయి.

అయిదేళ్ళక్రితం మాట! ఎలక్షన్ల పేరుతో పూరుపూరంతా వల్లకాడయింది. రాత్రికి రాత్రి ఈ కొట్టుకాడే తన్నుకున్నారు... కుమ్ముకున్నారు. పార్టీల పేరుతో బంధుత్వాలు మరచారు. బాకులు దూసారు.

తనకు బాగా గుర్తు... చంద్రినాయుడు తన గోడమీద మొదట వ్రాసాడు. కాని రాత్రికి రాత్రి బాబుర్రావు వర్గం వాట్ని చెరిపేసి తమ రాతలు రాసారు. ఇది తెలిసి చంద్రినాయుడు వర్గం వుద్రిక్త వాతావరణం సృష్టించింది. మధ్యన కిట్టయ్య సాక్షిగా యిరుకున్నాడు. తలోవైపు తన్నులు తిన్నాడు.

అబ్బ! అయిదేళ్ళెంత జరజర జారుకున్నాయి!! అందుకే ఎలక్షన్లంటే గుండె దడ..ఆందోళన.

గోడపైన ఎవరిని రాయద్దంటే వారికోపాలు. ఒకరు వ్రాస్తే మరొకరికి ఆగ్రహాలు.

కిట్టయ్య మనోక్షేత్రంలో ఆలోచనల యుద్ధం.

"అయ్యా! కడుపు నొక్కొచ్చింది" అంటూ కడుపుమీద చెయ్యేసి మూలపడుకుంది రత్తాలు. ఆ విలవిల చూడలేక గిలగిల్లాడాడు కిట్టయ్య.

వాము నీళ్ళు పట్టాడు. అయినా తగ్గలేదు. ఊర్లో ఆసుపత్రి నర్సమ్మను పిలుచుకు వచ్చాడు. కిట్టయ్యను పైకి పంపి పరీక్షించిందామె.

బయటకు వచ్చి పకపక నవ్వి.. "కిట్టయ్య! నీకెట్టా చెప్పాలో తెలీటం లేదు. అదేం నొప్పీగిప్పీ కాదు, రత్తి ఎదిగింది. ఏర్పాట్లు చెయ్యి" చెప్పి వెళ్ళబోయింది.

"ఆగమ్మా! నానేమో మగోడ్ని...ఆడంగిపన్లు నాకు సేతనవ్వు... ఏటేటి కావాల్నో నువ్వే సూడు.."

వందనోటు తీసిచ్చి చెప్పాడు. డబ్బు తీసుకుని చుట్టు ప్రక్కలవార్ని తీసుకొచ్చి రత్తాలు దగ్గర పెట్టి మార్కెట్టు కెళ్ళింది నర్సమ్మ.

తను పెంచిన మొక్క ఫలానికొస్తే వుత్పన్నమైయ్యే సంబరం ఓవైపు... తల్లి దగ్గరుండి జరపవలసిన సందడి ఇతరుల ఆసరాతో చేస్తున్నందుకు విచారం మరో వైపు కిట్టయ్యలో...

టీకొట్టు కట్టేసి ఊర్లో కెళ్ళి సైదులు దగ్గర మైకుసెట్టు మాట్లాడాడు. వాడొచ్చి మైకు కట్టి బిగ్గరగా పాటలు పాడించాడు. రత్తాలు ఎదిగిన సందర్భం మైకు చాటింది.

పుట్టలోని పాములన్నీ ఒక్కసారి తలలెత్తినట్లు వూరిలో మగపురుగులన్నీ టీ కొట్టుకొచ్చి కొత్తకొత్తగా పరామర్శించసాగాయి.

ఒకవైపు ఎన్నికల చర్చలు ముమ్మరంగా జరుగుతున్నాయి. చంద్రినాయుడు తన ఔదార్యంనంతటినీ విద్యుద్దీపాలలో మెరిపించాడు. టీకొట్టు గోడనే తెరచేసి సినిమా ఆడించాడు సూరిబాబు. రెండు వర్గాల వాళ్ళు కూడా సినిమాకొచ్చారు.

"ఇట్టాగే ఏ గొడవలూ లేకుండా సల్లగా సూడాలి భగవంతుడా!" కిట్టయ్య గుండెనిండుగా కోరుకున్నాడు.

అక్కడికి వారం తరువాత – బాబుర్రావు, చంద్రినాయుడు ఎవరి ముహూర్తాలు వారు పెట్టుకుని పెద్ద మిడతల దండులాగా బయలుదేరి నామినేషన్ వేసారు.

ప్రచార సంరంభం ప్రారంభమైంది. మైకులు కేకలు మొదలెట్టాయి. వాగ్వివాదాలు, పందాలు, పరవళ్ళు తొక్కసాగాయి.

ఓ రోజు రాత్రి–చిన్న అలికిడయితే లేచివీధిలోకి వెళ్ళాడు కిట్టయ్య. పోల్చుదానికి వీల్లేనంత దూరంలో ఎవరో పారిపోతూ...

ఆ వెంటే రత్తాలు వచ్చింది. "అయ్యా మన గోడ...." గతుక్కుమంది.

బిత్తరపోయాడు కిట్టయ్య.

"ఈల్లిమ్మడ... బంగారమంటి గోడ్ని మసిబూసారు. దిక్కుమాలోన్లు... ఈల్లకిట్లగాదు." అని బాల్చీడు నీళ్ళు గోడమీద పోసింది. మరింత మకిలైందే కాని

వదల్లేదు.

ఆ రాత్రి మరి కునుకుపట్టలేదు.

★★★

తూర్పుదిక్కున ఎర్రమందారంలా వికసిస్తున్నాడు సూరీడు. "ఏ్రటా సెంద్రినాయుడెంతిచ్చాడేటి! ఆడ్రాతలన్నీ గోడమీద కెక్కించావ్!" ఉదయాన్నే బాబుర్రావు వచ్చి కిట్టయ్య మీదకి దాడికి దిగాడు.

తనకేం తెలీదన్నాడు కిట్టయ్య.

"ఓర్దొంగనాకొండీ... నీకు తెల్వదని నాసెవిలో పువ్వెట్టీకు. రత్తెదిగినపుడు లైటింగెట్నపుడే అనుకున్న నీతో కుమ్మక్కయినాడని... నా సినిమా బొమ్మంటిత్తుంటే అడ్డెట్నోడివి. ఆడికెట్లా ఒప్పేసుకున్నావని! ఈ మద్దేనానికి ఆడ్రాతలు సెరగాల. నా రాతలైనా రాయనివ్వాల.. "మెడమీద చెయ్యేసి తోసి గబగబ వెళ్ళిపోయాడు బాబుర్రావు.

పడిపోయిన తండ్రిని నెమ్మదిగా లేవనెత్తింది రత్తాలు. అపుడే వచ్చిన సూరిబాబు కిట్టయ్య నుదుట రక్తం తుడిచి టీగుండవేసి కట్టుకట్టాడు.

జరిగింది తెలుసుకుని జలజలమని రాలుతున్న రత్తాలు కన్నీటిని తుడిచి ఆమె శిరస్సును ఆప్యాయంగా తడిమాడు. సూరిబాబు వెళ్ళిపోయినా అతని సాంత్వన వారికి కొంత గుండె ధైర్యాన్ని ప్రసాదించింది.

ఆరోజు టీ కొట్టు తెరవలేదు. వచ్చిన ప్రతివాడు గోడపై రాతలు చూసి నమ్మశక్యం కానట్లుండి పోయారు. మధ్యాహ్నం నాలుగ్గంటలౌతుంది. బాబుర్రావు వర్గం దిగారు. గోడమీద సున్నం కొడతామన్నారు. ఎవరు రాసినా తన కిట్టంలేదని, తగవులు పెంచుకోవద్దని మొరపెట్టుకున్నాడు కిట్టయ్య.

అయినా కాని, సున్నం బకెట్ చేతికిచ్చి గోడదగ్గరికి లాక్కెళ్ళాడు బాబుర్రావు. "ఊ! కానీ!" అదిలించాడు.

గోడమీద సున్నం పడబోయేలాగా "ఆగు" అంటూ చంద్రినాయుడు పటాలం మొత్తం దిగారు.

చెరపటానికి వీల్లేదని చంద్రినాయుడు, చెరుపుతావా, చెరపవాని బాబుర్రావు... అడకత్తెరలో పోకలా... బోనులో పడ్డ ఎలకలా... కిట్టయ్య...

చివరగా కిట్టయ్య ప్రమేయం లేకుండానే సున్నం కొట్టబోయాడు బాబుర్రావు. అడ్డగించాడు చంద్రినాయుడు. ఆ నాయకుల కనుసైగలతో వారి అనుయాయులు

రంగంలోకి దిగి రక్తం చిందించారు.

★ ★ ★

'ఓరి కిట్టయ్యా! పెద్ద కబుర్లాడినోడివి... నూసేసిన పనేటి! సెంద్రినాయుడే టిచ్చాడన్రా ఆధ్రాతలు రాయిప్పించావూ!... ఔన్లే మొన్ననేగా రత్తెదిగినాదని సోకులన్నీ సేసాడు... ఆడ్డాని వుంచుకుంటే మరీ కనకవర్సం కురత్తాది... లే..." నోటి కొచ్చినట్టల్లా కూస్తోంది పెంటచ్చి.

నిన్న సంఘటనతోనే బాగా దిగజారిపోయాడు కిట్టయ్య. ఇంక వాదనకీ, రోదనకీ శక్తి సన్నగిల్లింది. ఆ ప్రేలాపన మాత్రం రత్తాల్ని కుదిపింది. తగ్గమని సైగచేసాడు కిట్టయ్య.

బయట 'లూనా' చప్పుడు వినిపించింది.

"ఏటే పెంటచ్చీ వాగుతున్నావు... రత్తాల్ని పన్నెత్తి మాటన్నావంటే పళ్ళూడగొడ్తా... జాగర్త..." సూరిబాబు రాక రత్తాలుకీ, కిట్టయ్యకీ కొత్తవూపిరి పోసింది.

"రత్తాలు మీకేం భయంలేదు నేనుండగా..." అని ధైర్యం చెప్పాడు సూరిబాబు.

"బాబూ! మాదీ ఆ గోడ బతుకే అయిపోయినాది... సీవిడి ముద్దలు కొట్టినా, పేడముద్దలు కొట్టినా బరిత్తున్నాం.. గోడ్నాగే ఏపీ సెయ్యలేని సేతకానోల్లం అయిపోనాం.... బరించక తప్పటం నేదు బాబూ! "కిట్టయ్య శక్తిలేని గొంతులోంచే వేదన, వాక్కులై... హీనంగా... మంద్రంగా...

"పర్వాలేదు కిట్టయ్యా!... మీరేం భయపడకండి... నేనొస్తా..." నిష్క్రమించాడు సూరిబాబు.

"మనగ్రామం బాగుపడాలంటే చంద్రినాయుడిగారికే తమ విలువైన ఓటువేయాలి... పులి గుర్తుకే మీ ఓటు...." ప్రచార రథం యింటింటి దగ్గర ఆగి వెళ్తూంది. టీ కొట్టు దగ్గిరాగింది.

"ఒరే! కిట్టయ్యా! నీ ఓటు నాకే వెయ్యాలి. నీ సహకారం వల్లే నీ గోడపై నా రాత రాసుకున్నాను. నాకచ్చివచ్చిందిరా నీ గోడ... రత్తాలూ అయ్యను జాగ్రత్త.. వస్తా...." అనేసి వెళ్ళిపోయాడు చంద్రినాయుడు.

"థూ!" వుమ్మేసాడు కసిగా. తన సాయంతో రాయించాడా... ఎంత గొప్పనాటకం...??

★ ★ ★

ఎన్నికల్లో చంద్రినాయుడి వర్గానికి మెజారిటీ లభించింది.

బాబుర్రావు బుర్ర పాతాళంలోకి కృంగిపోయింది. పెద్దపెద్ద అంగలు వేస్తూ ఉడుకురక్తంతో నడిచాడు. తనకి అనుమానం వచ్చిన వారందరి యిళ్ళపై పడ్డాడు బాబుర్రావు.

"కిట్టయ్యా! నువ్విడుండడం క్షేమం. కాదు.. బాబుర్రావు నాగులా బుసకొడ్తున్నాడు. నువ్వు నాయుడిగారి కళ్ళాల్లో దాక్కో... నేను రత్తిని చూస్కుంటా..." సూరిబాబు వచ్చి చెప్పేసర్కి నిలువెల్లా వణికిపోయాడు కిట్టయ్య.

ఎలావున్నవాడలాగే వెనకనుండి పొలాల గుండా పరిగెత్తాడు. దూరంగా వున్న నాయుడు గారి కళ్లాల దగ్గర పెంకుటింటి విద్యుద్దీపం వుండి వుండి వెలిగి ఆరుతోంది.

పెంకుటింటి పంచన చేరాడు. ఏవోనవ్వులు..మాటలు వినిపిస్తున్నాయి. లేచి కిటికీ దగ్గరగా నిలబడ్డాడు కిట్టయ్య.

"ఏదో మీ అందరి మద్దత్తువల్ల మళ్లీ గెలిచాను...అందువల్ల ప్రస్తుతానికీ పార్టీ, ఈ మొత్తం తీసుకోండి" చంద్రినాయుడు స్వరం.

"ఈ పార్టీయేననా లేక మరేదైనా ఏర్పాట్లుగానీ" నసిగిందో కంఠం.

"సూరిబాబును పంపాగా... ఈ మధ్యనే ఆ కిట్టిగాడి గుంట రత్తి ఎదిగింది కదర్రా. దాని మీద మన సూరిబాబు కన్నేసాడు. వాడి సర్దా తీర్చుకున్నాకే మనకి వదలమన్నాను. పోయాడు మొత్తానికి కార్య సాధకుడేన్లే..." నాయుడి నవ్వు...

కిట్టయ్య పిడికిళ్లలో వజ్రాలున్నా ఆక్షణం పిండిరాళ్లయ్యేవి.

మంచిబుక్కడం లాంటివాడని నమ్మిన సూరిబాబు నాగని తెలిసింది..ఛ! ఎంత కుట్ర??

కిట్టయ్య మొదటికంటే యిప్పుడు బాగా పరిగెడుతున్నాడు. రాళ్లు తన్నుకుంటున్నా... ముళ్లుగీరుకుంటున్నా లక్ష్యపెట్టక పరుగులెడుతున్నాడు.

"సూరిబాబూ! నన్నేం సెయ్యమాక... నీకు పున్నెం వుంటాది. అన్నలా సూస్కున్నాను.." అర్థింపుగా అంటూ రోదిస్తూంది రత్తాలు.

ధడాలున తలుపురెక్కలు తోసుకుని లోనికి దూసుకెళ్ళాడు కిట్టయ్య...అతని రాక వూహించని సూరిబాబు గతుక్కుమని లేచాడు. రత్తాలు పైట సర్దుకుంది. జాకెట్ పీలికలై వ్రేలాడుతున్నాయి.

"ఓర్రాచ్చసుడా! నువ్వేదో మమ్ముల్నుద్ధరిత్తున్నావనుకున్నాగాని - యింత

దుర్మార్గుడివనుకోనేదురా.. నిన్ను...నిన్నూ..” ముందుకు వెళ్లబోయాడు.

“తగ్గుతగ్గెహె... ముసలాడా... నీ గోడకట్టుకుందికి గవర్మంటోళ్ల చేత పైనలివ్పించింది వూర్కనే అనుకున్నావా! అందుకు నాకయిన ఖర్చు..? నీకిప్పించినందువల్ల నాకేం లాభం... నేనే అడ్డుపడక పోతే... నిన్ను.. ఈ రత్తి గుంటనీ ఏనాడో, బాబు్రావూ, నాయుడూ మింగిపారేసేవోరు...తెలిసిందా!” సూరిబాబులో కామం కళ్లలో ఎర్రజీరల్ని సృష్టించింది.

కిట్టయ్య కర్రతీసి మీదకి ఎగిరాడు. రత్తాలు వారించింది. సూరిబాబు చేతులు కట్టుక్కూచోలేదు. అతని కెదురొస్తూ ఆ కర్రనే వెనక్కితోసాడు. ఆ తోపుడుకి కిట్టయ్యవెళ్ళి రుబ్బురోటిపైన పడ్డాడు.

శోకానికి ప్రతిబింబంలావున్న రత్తాల్ని లాగిపడదోసి తన వాంఛ తీర్చుకున్నాడు సూరిబాబు. అయ్య ఏమైనాడో చూడ్డానికి మరిలేవలేకపోయింది రత్తాలు.

చాలా మట్టుకు చీకటి ఆక్రమించింది.

“తవ్వండెహె.. ఎదవద్దీని మూలంగానే తగూలు..తంటాలు లెగిసాయి” బాబు్రావు వర్గం వాళ్లు గునపాలు పట్టుకుపొడుస్తున్నారు.

గోడ కదిలికదిలి కృంగుతూంది.

ఎవరికీ కనపడకుండా పరిగెట్టాడు సూరిబాబు

★ ★ ★

రెండు రోజుల తర్వాత పేపర్లో – “గోడకూలి తండ్రీకుతుళ్ల దుర్మరణం.” వార్త చదివిన సూరి బాబు చంద్రినాయుడివంక చూసి వికటంగా నవ్వాడు.

ఆ నవ్వుకు శృతి కలిపాడు చంద్రినాయుడు.

(ఈనాడు ఆదివారం 6-10-1991)

(ఈ కథను ‘గోడ’ నాటికగా వ్రాయగా రెండు సార్లు నాటక పరిషత్ పోటీలో ఉత్తమరచన అవార్డును గెలుచుకుంది – ఈ కథను నాటికగా వ్రాయమని ప్రోత్సహించిన శ్రీ శొంఠినేని కిషోర్‌కు కృతజ్ఞతలు.)